# సాహో స్వప్నిల్

## పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్‌లో కాంస్యం

### పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు మూడో పతకం

### ఐదు రోజుల వ్యవధిలో 3 పతకాలు తెచ్చిన షూటర్లు



విశ్వక్రీడలు మొదలై వారం రోజులు కావొస్తున్నా పలు క్రీడాంశాల్లో ఒడిదొడుకుల మధ్య సాగుతున్న భారత అథ్లెట్ల ప్రయాణానికి భిన్నంగా షూటర్లు సత్తా చాటుతున్నారు. బరిలో దిగితే పతకం పక్కా అనే రేంజ్‌లో రెచ్చిపోతున్నారు. పారిస్‌లో మన 'పిస్టల్ వీరులు' ఇది వరకే రెండు సార్లు కంచు మోత మోగించగా గురువారం మరో యువ షూటర్ స్వప్నిల్ కుసాలె సైతం గురితప్పని లక్ష్యంతో కాంస్య పతకాన్ని పట్టుకొచ్చాడు. పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఫైనల్‌లో మూడో స్థానంలో నిలిచి దేశానికి ముచ్చటగా మూడో పతకాన్ని అందించడమే గాక ఈ ఈవెంట్‌లో పతకం నెగ్గిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించాడు. ఐదు రోజుల వ్యవధిలోనే మను భాకర్, సరబ్‌జ్యోత్ సింగ్, స్వప్నిల్..షూటింగ్‌లో మూడు పతకాలు అందించడం గమనార్హం.



పారిస్: ఒలింపిక్స్‌లో భారత తుపాకీ మరోసారి గురితప్పని బుల్లెట్‌తో సత్తా చాటింది. ఐదు రోజులుగా జరుగుతున్న షూటింగ్ ఈవెంట్స్‌లో చెక్కుచెదరని లక్ష్యాలతో దేశానికి ఇది వరకే రెండు కాంస్యాలను అందించిన మన షూటర్లు విశ్వక్రీడా యవనికపై మువ్వన్నెల పతకాన్ని మరోసారి రెపరెపలాడించారు. గురువారం జరిగిన పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ (త్రీ పీ)లో భారత యువ షూటర్ స్వప్నిల్ కుసాలె కాంస్య పతకం గెలుచుకుని దేశ క్రీడాభిమానుల ఆనందాన్ని 'మూడింతలు' చేశాడు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఏడో స్థానంలో నిలిచి ఎనిమిది మంది అర్హత సాధించిన ఫైనల్‌లో 451.4 పాయింట్లు స్కోరు చేసిన అతడు దేశానికి మరోసారి కంచు మోత మోగించాడు. తద్వారా ఐదు రోజుల వ్యవధిలోనే భారత్‌కు షూటింగ్‌లోనే మను భాకర్, సరబ్‌జ్యోత్ సింగ్ తర్వాత 3వ పతకం అందించిన మూడో షూటర్‌గా నిలిచాడు. ఇదే ఈవెంట్‌లో చైనా షూటర్ యుకున్ లియు (463.6) స్వర్ణం గెలుచుకోగా ఉక్రెయిన్‌కు చెందిన సెర్హియ్ కులిష్ (461.3) రజతం నెగ్గాడు.

**గురి కుదిరిందిలా..**

మూడు విధాలుగా (స్టాండింగ్, నీలింగ్, ప్రోన్) జరిగే ఈ ఈవెంట్ ఫైనల్ పోరును స్వప్నిల్ నెమ్మదిగానే మొదలుపెట్టాడు. మోకాళ్ల మీద కూర్చునే (నీలింగ్) విభాగంలో మూడు సిరీస్‌లలోనూ స్వప్నిల్ 50.8, 50.9, 51.6తో మొత్తంగా 153.3 పాయింట్లు సాధించి ఈ రౌండ్ అయిపోయేసరికి ఆరో స్థానంలో నిలిచాడు. కానీ బోర్లా పడుకుని (ప్రోన్) షూట్ చేసే విభాగంలో స్కోరును మెరుగుపర్చుకున్నాడు. మూడు సిరీస్‌లలో 52.7, 52.2, 51.9 (156.8) స్కోరు చేసి ఓవరాల్‌గా 310.1 పాయింట్లు సాధించాడు. ఇక చివరిదైన స్టాండింగ్ పొజిషన్‌లో (రెండు సిరీస్‌లు మాత్రమే) 51.1, 50.4తో ఓవరాల్‌గా 411.6 పాయింట్లు రాబట్టి ఆరో స్థానానికే పరిమితమయ్యాడు. 40వ షాట్ తర్వాత ఎలిమినేషన్ రౌండ్ మొదలవగా తర్వాత వరుసగా నాలుగు షాట్లలో 10.5, 9.4, 9.9, 10.0 స్కోరుతో తన ప్రత్యర్థులను చిత్తు చేసి మూడో స్థానంతో ముగించాడు.

**3** ఒకే ఎడిషన్‌లో షూటింగ్ విభాగంలో భారత్ సాధించిన పతకాలు. దేశ ఒలింపిక్ చరిత్రలో ఇదే ప్రథమం.

**7** షూటింగ్‌లో ఇప్పటిదాకా భారత్‌కు వచ్చిన పతకాలు. హాకీ (12) తర్వాత ఈ క్రీడలోనే అత్యధికం.

## బుల్లెట్లు దింపుతున్నారు!

*నమస్తే తెలంగాణ క్రీడావిభాగం*

ఒలింపిక్స్‌లో మునుపెన్నడూ లేని విధంగా మన షూటర్లు గురి తప్పని లక్ష్యాలతో పతకాల పంట పండిస్తున్నారు. ఈ క్రీడలో పుష్కరకాలం (చివరిసారిగా 2012లో)గా ఉన్న పతక కరువును తనివితీరా తీర్చుతున్నారు. 2016, 2020లో రిక్తహస్తాలతో తిరిగొచ్చిన మన షూటర్లు పారిస్‌లో మాత్రం 'ఎప్పుడొచ్చామన్నది కాదన్నయ్యా.. బుల్లెట్ దిగిందా లేదా!' అన్నట్టుగా బరిలోకి దిగితే గురి పతకానికే అనే రేంజ్‌లో రెచ్చిపోతున్నారు. దేశానికి పతక బోణీ కొట్టిన యువ సంచలనం మను భాకర్ ఇచ్చిన స్ఫూర్తితో మిగతా షూటర్లు అంచనాలను మించి రాణిస్తున్నారు. ఆమెతో కలిసి సరబ్‌జ్యోత్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో కాంస్యాన్ని నెగ్గగా తాజాగా స్వప్నిల్ సైతం పతక గురితప్పలేదు. ఈ రెండు ఈవెంట్స్‌లో భారత్ తొలిసారిగా మెడల్స్ నెగ్గడం విశేషం. మనుపై అంచనాలున్నా సరబ్‌జ్యోత్, స్వప్నిల్ మాత్రం సర్‌ప్రైజ్ ప్యాకేజీలే. త్రుటిలో గురి తప్పింది గానీ మెన్స్ 10 మీటర్స్ ఎయిర్ రైఫిల్‌లో అర్జున్ బబుతా కూడా పతకాన్ని పట్టుకొచ్చేవాడే. నాలుగో స్థానంలో నిలిచినా అతడి ప్రదర్శనను కొట్టిపారేయలేం. రమితా జిందాల్ సైతం అంచనాలకు మించి రాణించింది. రికార్డు స్థాయిలో ఈసారి 21 మంది తో పారిస్ బరిలో నిలిచిన భారత్.. టోక్యో వైఫల్యాలను మరిచిపోయి విజయవంతంగా ముందుకు సాగుతోంది. ఆత్మవిశ్వాసంతో పోటీలో నిలుస్తున్న షూటర్లు.. మొక్కవోని ఏకాగ్రత, చెక్కుచెదరని లక్ష్య సాధనతో పది పాయింట్ల వృత్తంలోకి గురిపెడుతూ పతకాలు పట్టుకొస్తున్నారు. ఇప్పటికే మూడు పతకాలు వచ్చిన షూటింగ్‌లో మనుతో పాటు హైదరాబాదీ యువ షూటర్ ఇషా సింగ్ పోటీలో ఉన్న మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లోనూ భారత్ పతకాలు ఆశిస్తోంది. శుక్రవారం జరిగే ఈ ఈవెంట్‌లో మనుభాకర్, ఇషా సింగ్ పోటీపడనున్నారు.

**1** ఒలింపిక్స్ రైఫిల్ త్రీ పొజిషన్స్ ఈవెంట్‌లో భారత్‌కు ఇదే తొలి పతకం.

### పతకాల పట్టిక

| | దే | స్వ | ర | కా | మొ |
|---|---|---|---|---|---|
| 1 | చైనా | 11 | 7 | 4 | 22 |
| 2 | ఫ్రాన్స్ | 8 | 11 | 8 | 27 |
| 3 | జపాన్ | 8 | 3 | 4 | 15 |
| 4 | ఆస్ట్రేలియా | 7 | 6 | 4 | 17 |
| 5 | యూఎస్‌ఏ | 6 | 13 | 12 | 31 |
| 6 | బ్రిటన్ | 6 | 7 | 7 | 20 |
| 43 | భారత్ | 0 | 0 | 3 | 3 |

దే: దేశం, స్వ: స్వర్ణం, ర: రజతం, కా: కాంస్యం మొ: మొత్తం

## ప్రెసిడెంట్ గారి అబ్బాయి

'పారిస్'లో దేశానికి మూడో పతకం అందించిన స్వప్నిల్‌ది సాధారణ మధ్యతరగతి కుటుంబం. 1995 ఆగస్టు 6న పూణెకు సమీపంలో ఉన్న కొల్హాపూర్ జిల్లా రత్నగిరి తాలూకా కంబల్వాడి గ్రామంలో అతడు జన్మించాడు. స్వప్నిల్ తల్లి అనిత ప్రస్తుతం ఆ గ్రామ సర్పంచ్‌గా విధులు నిర్వర్తిస్తోంది. పూర్తి స్థాయిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న గ్రామంతో పాటు 'సంపూర్ణ మద్యనిషేదం' అమలులో ఉన్న గ్రామంగా ఆ ఊరుకు దేశవ్యాప్తంగా పేరుంది. స్వప్నిల్ తండ్రి స్థానిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలోనే చదివిన స్వప్నిల్‌ను అతడి తండ్రి 14వ ఏట మహారాష్ట్ర క్రీడా పతకం అయిన 'క్రీడా ప్రబోధిని'లో చేర్పించి శిక్షణ ఇప్పించాడు. ఏడాది శిక్షణ అనంతరం స్వప్నిల్ షూటింగ్‌ను తన కెరీర్‌గా ఎంచుకున్నాడు. 2015లో ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్ (జూనియర్ స్థాయిలో) స్వర్ణం నెగ్గిన అతడు 59వ జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్ (50 మీటర్ల రైఫిల్ ప్రోన్)లో ప్రస్తుతం పారిస్ ఒలింపిక్స్‌లో భారత బృందానికి 'చెఫ్ డి మిషన్'గా ఉన్న గగన్ నారంగ్‌ను ఓడించాడు. 2012 నుంచి అంతర్జాతీయ టోర్నీలలో పోటీ పడుతున్నా 12 ఏండ్ల తర్వాత ఒలింపిక్స్‌లో అరంగేట్రం చేశాడు.

## ధోనీ ఫ్యాన్

భారత క్రికెట్ అభిమానులు 'మిస్టర్ కూల్' అని పిలుచుకునే ధోనీకి స్వప్నిల్ వీరాభిమాని. ధోనీ మాదిరిగానే అతడు కూడా రైల్వేలో టికెట్ కలెక్టర్‌గా పనిచేస్తున్నాడు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న షూటింగ్‌లో ఎటువంటి పరిస్థితులు ఎదురైనా ఆత్మవిశ్వాసం కోల్పోకుండా ప్రశాంతంగా ఉండటం అత్యంత కీలకమని క్రికెట్‌లో ధోనీ నుంచి తాను అది నేర్చుకున్నానని అంటున్నాడీ కుర్రాడు. 'నేను షూటింగ్‌లో పెద్దగా ఎవరినీ ఆరాధించను. కానీ నాకు ధోనీ అంటే అభిమానం. నా ఆటలో ప్రశాంతంగా ఉండటం చాలా ముఖ్యం. నేను దానిని ధోనీ నుంచే నేర్చుకున్నా. అంతేగాక నేను కూడా అతడి మాదిరిగానే రైల్వేలో టికెట్ కలెక్టర్‌ను' అని తెలిపాడు. స్వప్నిల్ 2015 నుంచి పూణె రైల్వే డివిజన్‌లో టీటీఈగా పనిచేస్తున్నాడు.

### ముగిసిన ప్రణయ్, సాత్విక్ జోడీ, సింధు ప్రయాణం

# ఆశలు ఆవిరి

**ఆరో రోజు భారత్‌కు నిరాశజనక ఫలితాలు • పోరాడి ఓడిన నిఖత్ జరీన్**

**హాకీలో భారత్‌కు తొలి పరాజయం • టీటీ ప్రిక్వార్టర్స్‌లో శ్రీజకు తప్పని ఓటమి**

పారిస్: ఒలింపిక్స్‌లో ఆరో రోజు భారత్‌కు నిరాశజనక ఫలితాలు వచ్చాయి. దేశానికి పక్కాగా పతకం పట్టుకొస్తారని భారీ ఆశలు పెట్టుకున్న ప్రధాన క్రీడాకారులంతా దారుణంగా విఫలమై ఇంటిబాట పట్టారు. స్వర్ణ పతకమే లక్ష్యంగా బరిలో నిలిచిన బాక్సర్ నిఖత్ జరీన్, బ్యాడ్మింటన్ స్టార్ ద్వయం సాత్విక్-చిరాగ్, హెచ్‌ఎస్ ప్రణయ్ ప్రయాణం ముగిసింది. మూడో పతకం వేటలో ఉన్న పీవీ సింధు..??? పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ ఒక్కడే ముందంజ వేశాడు. టేబుల్ టెన్నిస్ స్టార్ ఆకుల శ్రీజ ప్రిక్వార్టర్స్‌లో ఓటమిపాలైంది. ఆర్చర్ ప్రవీణ్ జాదవ్ నిరాశపరచగా హాకీలో మెన్ ఇన్ బ్లూకు తొలి ఓటమి ఎదురైంది. షూటింగ్, అథ్లెటిక్స్, సెయిలింగ్‌లో భారత క్రీడాకారులు అర్హత రౌండ్లకు కూడా చేరలేక చతికిలపడ్డారు.



### నిఖత్‌కు నిరాశ

విశ్వక్రీడలకు ముందు రెండుసార్లు ప్రపంచ చాంపియన్ అయిన ఇందూరు అమ్మాయి నిఖత్ జరీన్‌కు మహిళల 50 కిలోల విభాగంలో అనూహ్య పరాభవం ఎదురైంది. ప్రిక్వార్టర్స్‌లో నిఖత్ 0-5తో చైనా బాక్సర్ వు హు చేతిలో ఓడింది. మూడు బౌట్స్‌లోనూ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన వు హు పంచ్ పవర్ ధాటికి నిఖత్ వద్ద సమాధానమే లేకుండా పోయింది. ఓటమి అనంతరం ఆమె కన్నీటిపర్యంతమైంది. పురుషుల 71 కిలోల విభాగంలో నిషాంత్ దేవ్ 3-2తో జోస్ గాబ్రియెల్ (ఈక్వెడార్)ను ఓడించి క్వార్టర్స్ చేరాడు.



### సింధు నిష్క్రమణ

భారత స్టార్ షట్లర్ పీవీ సింధు..పారిస్ ఒలింపిక్స్ నుంచి నిష్క్రమించింది. డబుల్ ఒలింపియన్ అయిన సింధు..ఈసారి కచ్చితంగా పతకం గెలుస్తుందన్న భారీ అంచనాల మధ్య బరిలోకి దిగింది. అయితే గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్ పోరులో సింధు 19-21, 14-21తో చైనాకు చెందిన హీ బింగ్‌జియావో చేతిలో ఓడింది. దాదాపు గంటసేపు హోరాహోరీగా సాగిన పోరులో చైనా షట్లర్‌కు దీటైన పోటీనివ్వడంలో సింధు విఫలమైంది. మరోవైపు కీలక క్వార్టర్స్‌లో మాజీ ప్రపంచ నంబర్‌వన్ జోడీ సాత్విక్-చిరాగ్ 21-13, 14-21, 16-21తో ఆరోన్ చియా-సో వుయి యిక్ (మలేషియా) చేతిలో పోరాడి ఓడింది. పురుషుల సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్.. 12-21, 6-21తో భారత్‌కే చెందిన లక్ష్యసేన్ చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించాడు.

## అర్హతకు అందనతంత దూరంలో

మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ క్వాలిఫికేషన్ రౌండ్‌లో భారత్ భారీ ఆశలు పెట్టుకున్న సిఫ్ట్‌కౌర్ సమ్రా తీవ్రంగా నిరాశపరిచింది. 32 మంది పాల్గొన్న ఈ రౌండ్‌లో ఆమె 31వ స్థానంలో నిలిచింది. ఇదే ఈవెంట్‌లో వెటరన్ అంజుమ్ గాడ్గిల్ 18వ స్థానంతో సరిపెట్టుకుంది. ఆర్చరీ పురుషుల విభాగంలో ఉన్న ఏకైక ఆర్చర్ ప్రవీణ్ జాదవ్.. 0-6తో కవొ వెంచవొ (చైనా) ఓటమిపాలయ్యాడు. అథ్లెటిక్స్ విభాగంలో భాగంగా పురుషుల 20 కిలోమీటర్ల రేస్‌వాక్‌లో వికాస్ సింగ్ (30), బిసత్ (37) టాప్-25లోకి కూడా రాలేదు. మహిళల విభాగంలో ప్రియాంక గోస్వామి 41వ స్థానంతో ముగించింది. సెయిలింగ్ మెన్స్ కేటగిరీలో శరవణన్ 25వ స్థానంలో నిలిచాడు.



ఇక హాకీలో క్వార్టర్స్ దిశగా సాగుతున్న భారత్‌కు బెల్జియం షాకిచ్చింది. పూల్ బీ నాలుగో మ్యాచ్‌లో బెల్జియం 2-1తో భారత్‌పై గెలిచింది. 18వ నిమిషంలో అభిషేక్ గోల్ చేయగా బెల్జియం నుంచి జాన్ (33), డొహ్మెన్ (44) రెండు గోల్స్ కొట్టారు. టేబుల్ టెన్నిస్‌లో ప్రిక్వార్టర్స్ చేరిన ఆకుల శ్రీజ.. 0-4తో సున్ యింగ్ష (చైనా) చేతిలో ఓటమిపాలైంది.

## భారత్ X శ్రీలంక

**నేడు తొలి వన్డే మ్యాచ్.. మ: 2.30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో**



కొలంబో: భారత్, శ్రీలంక వన్డే పోరుకు వేళయైంది. శుక్రవారం ఇరు జట్ల మధ్య తొలి వన్డే జరుగనుంది. ఇప్పటికే టీ20 సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసి మంచి జోరుమీదున్న టీమ్‌ఇండియా అదే ఊపులో లంకను వన్డేల్లో చిత్తుచేయాలని చూస్తున్నది. రానున్న చాంపియన్స్ ట్రోఫీని దృష్టిలో పెట్టుకుని జట్టులో మార్పులు, చేర్పులు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా వికెట్‌కీపర్, బ్యాటర్ విషయంలో కేఎల్ రాహుల్, రిషబ్ పంత్ మధ్య పోటీ నెలకొన్నది. కెప్టెన్ రోహిత్, చీఫ్ కోచ్ గంభీర్ ఎవరికి ప్రాధాన్యమిస్తారనేది ఆసక్తికరంగా మారింది. టీ20లకు వీడ్కోలు పలికిన స్టార్ ప్లేయర్లు రోహిత్, కోహ్లీ తిరిగి జట్టులోకి రావడం టీమ్‌ఇండియాకు అదనపు బలం కానుంది. మరోవైపు కొత్త కెప్టెన్ చరిత అసలంక నేతృత్వంలో లంక బరిలోకి దిగనుంది. టీ20 సిరీస్ ఓటమికి వన్డేల్లోనైనా ప్రతీకారం తీర్చుకోవాలని లంక పట్టుదలతో కనిపిస్తున్నది.

### • బదిలీలు చేపట్టాలని 'ఆదర్శ' టీచర్ల ధర్నా



మాడల్ స్కూల్ టీచర్ల బదిలు చేపట్టాలని గురువారం ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించారు. ఉపాధ్యాయులు అరవింద్ ఘోష్, ఇష్రాద్‌అలీ, సాయిచరణ్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 194 మాడల్ స్కూళ్లలో టీచర్లు 11 ఏండ్లుగా బదిలీలు లేక స్వస్థలాలకు దూరంగా ఉంటూ ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నామని చెప్పారు. - చిక్కడపల్లి

### • మంచినీళ్ల కోసం మహిళల నిరసన



సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం కిష్టంపేటలో కొన్ని రోజులుగా మంచి నీళ్లు రావడం లేదని గురువారం మహిళలు బిందెలతో గ్రామంలోని వాటర్ ట్యాంకు వద్ద నిరసన తెలిపారు. నీళ్ల పైపు పగిలిపోవడంతో నీళ్లు రావడం లేదని పంచాయతీ కార్యదర్శిని అడిగితే.. తనకు సిబ్బంది సహకరించడం లేదని చెప్పినట్టు మహిళలు పేర్కొన్నారు. - కొమురవెల్లి



### కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

హైదరాబాద్, ఆగస్టు 1 (నమస్తే తెలంగాణ): వైద్యారోగ్య శాఖలోని వివిధ విభాగాల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. యూనియన్ నేతలు గురువారం కోఠిలోని ఎన్‌హెచ్‌ఎం కమిషనర్ కార్యాలయ ముట్టడికి యత్నించారు. పోలీసులు వారిని అరెస్టు చేశారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదనాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 8 నెలలవుతున్నా వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడం లేదని ఆరోపించారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని, బదిలీలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

### • అర్హులకు రుణమాఫీ కాలేదంటూ నిరసన



ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండల కేంద్రంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర వద్ద గురువారం బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. బ్యాంకర్లు, అధికారుల నిర్లక్ష్యం వల్ల అర్హులకు రుణమాఫీ కాలేదని బీజేపీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ ఆధ్వర్యంలో రైతులు బ్యాంకు ఎదుట బైఠాయించారు. అర్హులందరికీ రుణమాఫీ చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. రుణమాఫీ వివరాలను తెలుపాలని, అధికారులు బ్రోకర్ వ్యవస్థను మానుకోవాలని సూచించారు. -గుడిహత్నూర్

### • దళితబంధు నిధుల కోసం ఆందోళన



కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద దళితబంధు రెండోవిడత బాధిత సాధన సమితి ఆధ్వర్యంలో గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోపు పెండింగ్‌లో ఉన్న రెండోవిడత డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. -కరీంనగర్, (నమస్తే తెలంగాణ)

### • నేత కార్మికుల వంటావార్పు



కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తిలో చేనేత కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం 8వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా గురువారం గ్రామంలో వంటావార్పు నిర్వహించారు. అనంతరం రోడ్డుపై కూర్చొని సహపంక్తి భోజనాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్త్రాల ఉత్పత్తికి ఆర్డర్లు ఇవ్వకపోవడంతో ఉపాధి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. -గంగాధర



### రుణమాఫీ బాధిత రైతుకు న్యాయం చేస్తాం

• ఫోన్‌లో మాట్లాడి భరోసా ఇచ్చిన జిల్లా అధికారులు

న్యాల్‌కల్, ఆగస్టు 1: బ్యాంకు అధికారుల నిర్లక్ష్యంతో రుణమాఫీలో నష్టపోయిన సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం హద్నూర్ రైతు ఆవుటి అంజన్నకు న్యాయం చేస్తామని జిల్లా అధికారులు భరోసా ఇచ్చారు. గురువారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'బ్యాంకు అధికారుల నిర్లక్ష్యంతో నష్టపోతున్న రైతులు' కథనానికి అధికారులు స్పందించారు. కెనరా బ్యాంకు అధికారుల నిర్లక్ష్యంతో రుణమాఫీ డబ్బులు వెనక్కిపోయి నష్టపోయిన రైతు ఆవుటి అంజన్నకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా హెల్ప్‌లైన్ అధికారి అరుణ ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బ్యాంకు ద్వారా తీసుకున్న పంట రుణాన్ని తిరిగి చెల్లించి రెన్యూవల్ చేసుకున్నప్పటికీ బ్యాంకు అధికారుల తప్పిదంతో పాత బ్యాంకు లోన్ నంబర్‌ను పంపడంతో మాఫీ డబ్బులు వెనక్కి వెళ్లిపోయినట్టు రైతు తెలిపాడు. ఈ విషయం జిల్లా అధికారుల దృష్టికి వెళ్లిందని, తప్పకుండా న్యాయం చేస్తామని జిల్లా అధికారి అరుణ బాధిత రైతుకు భరోసా చేప్పారు. తన గోడును జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లిన 'నమస్తే తెలంగాణ'కు రైతు కృతజ్ఞతలు తెలిపారు.